

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,50,963 లు, బంగారం 350 మిల్లీగ్రాములు, వెండి 84గ్రాములు 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



చి'వరి' ప్రయాస..!

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో గంజాం జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరిపంటను రక్షించుకునేందుకు రైతులు ప్రయాస పడుతున్నారు.

- 8లో

శంభో.. శివ శంభో

కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకుని గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి

- 8లో



న్యూస్‌రీల్

గ్యాస్ ట్యాంకర్, లారీ ఢీ



ప్రమాద స్థలంలో ట్యాంకర్, ట్రక్కు

జయపురం: ఒక గ్యాస్ ట్యాంకర్, లారీ ఢీకొన్న ఘటన జయపురం–కొరాపుట్ సమీప జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒక కారు సైతం వాటివలన ప్రమాదానికి గురయ్యింది. అయితే ఎవరికీ ప్రాణనష్టం జరగలేదు. ప్రమాదం వలన ఘాట్ రోడ్డులో కొన్ని గంటల పాటు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందిన వెంటనే జయపురం సదర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అనంతరం పోలీసులు ట్యాంకర్, ట్రక్కులను సీజ్ చేశారు. ట్యాంకర్ డ్రైవర్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో తెలిసిందని జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి అభిప్రాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే ట్రక్కు డ్రైవర్ కిందకి దూకి ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు.

జగన్నాథునికి యజ్ఞోపవీత సేవ

భువనేశ్వర్: శ్రీజగన్నాథుని యజ్ఞోపవీత సేవ సోమవారం నిర్వహించారు. మార్గశిర కృష్ణ పక్షం సప్తమి తిథి పురస్కరించుకుని ఈ సేవ చేపట్టారు. ఈ సందర్భంగా ద్వితీయ భోగ మండప సేవ ముగిసిన తర్వాత యజ్ఞోపవీత సేవ సన్నాహాలు చేపట్టారు. శ్రీమందిరం గర్భాలయంలో గోప్యంగా ఈ సేవ చేపడతారు. ఈ నేపథ్యంలో సుదీర్ఘంగా 5 గంటల పాటు సేవ కొనసాగడంతో ఇతరుల ప్రవేశం నివారించారు. దీంతో ఈ వ్యవధిలో సాధారణ భక్తులు, యాత్రికులకు సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపి వేశారు. సేవ అనంతరం స్వామివారిని అభిషేకించారు.

ఎలుగుబంటి దాడిలో రైతుకు గాయాలు



చికిత్స పొందుతున్న జితేంద్ర సింగ్

జయపురం: కొరాపుట్ జిల్లా మహాదేవ్‌పుట్ గ్రామ పంచాయతీ రెంగాగుడ గ్రామంలో జితేంద్రసింగ్ అనే యువ రైతుపై ఆదివారం రాత్రి ఎలుగుబంటి దాడి చేయడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. జితేంద్ర సింగ్ తన మొక్కజొన్న తోట నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా అతడిపై ఎలుగు దాడిచేసి తీవ్రంగా గాయపరచింది. విషయం తెలిసిన స్థానికులు అతడిని కొరాపుట్ సహిద్ లక్ష్మణ్ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. అటవీ విభాగ అధికారి బికాశ కుమార్ పాత్రో ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రుడిని పరామర్శించారు. అతడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా అతడి కుటుంబానికి అవసరమైన సాయం అందిస్తామని వెల్లడించారు.

మళ్లీ మునిగుడలోకి పెద్దపులి



కొరొబాదొందొ వద్ద కెమెరాకు చిక్కిన పులి

రాయగడ: కొద్ది రోజులుగా ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న పెద్దపులి తాజాగా మునిగుడ అటవీ ప్రాంతమైన కొరొడాబొంధొలో కనిపించింది. ఆదివారం అర్ధరాత్రి అడవుల నుంచి నడుచుకుంటూ కొరొడాబొంధొ సమీపంలోని ఒక వంతెనను దాటుతున్నట్లు కెమెరాలో రికార్డు అయ్యింది. దీంతో ఆ ప్రాంత ప్రజలను అటవీ అధికారులు అప్రమత్తం చేశారు. వారం రోజుల క్రితం గజపతి జిల్లా నుంచి రాయగడ జిల్లా గుణుపూర్ సబ్ డివిజన్ గుడారి, చంద్రపూర్ ప్రాంతాల్లో సంచరిస్తున్న పులి అడుగులను గుర్తించిన అటవీ శాఖ అధికారులు, అనంతరం దాని అడుగుజాడల బట్టి పులి కందమాల్ జిల్లాలోని కుటాగొడా అడవులకు వెళ్లిపోయినట్లు భావించారు. అయితే తాజాగా అది మళ్లీ కందమాల్ జిల్లా నుంచి రాయగడ–కందమాల్ జిల్లా సరిహద్దు ప్రాంతమైన కొరొడాబొంధొ ప్రత్యక్షమవ్వడంతో అది మళ్లీ రాయగడ జిల్లాలో సంచరిస్తున్నట్లు భావించి చర్యలు తీసుకుంటున్నారు.



వైభవం.. కోణార్క్ ఉత్సవం



కోణార్క్ సూర్య దేవాలయం ఆవరణలో కోణార్క్ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ శాస్త్రీయ సంగీత నృత్య కళాకారులు ఈ వేదికపై మనోహర ముగ్ధమైన నృత్య రూపకాలు ఇతరేతర సాంస్కృతిక ప్రదర్శనల్లో పాలుపంచుకుంటున్నారు. సీఎంవో ముఖ్య సలహాదారు (స్పెషల్ ఇనీషియేటివ్స్) ఆర్. బాలకృష్ణన్, శ్రీజగన్నాథ ఆలయం అథారిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ రంజన్ కుమార్ దాస్, పర్యాటక శాఖ డైరెక్టర్ సచిన్ ఆర్.జాదవ్ సమక్షంలో జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. సత్రియా మరియు ఒడిస్సీ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి.

– భువనేశ్వర్











మేనమామ సన్నిధికి మహా ప్రభువు

- నేడు ప్రథమాష్టమి
- జ్యేష్ట సంతానానికి ప్రత్యేక అలంకరణలు
- ప్రతి ఇంట్లో ఎండురి పితా

భువనేశ్వర్: మార్గశిర మాసం కృష్ణపక్షం అష్టమి ప్రథమాష్టమిగా ప్రసిద్ధి. ప్రతి ఒడియా ఇంట ప్రథమాష్టమి ఆనంద వేడుకలతో జరుపుకుంటారు. పూర్వం రాష్ట్రంలో మార్గశిర మాసం సంవత్సరం తొలి నెలగా పరిగణించబడేది. ఇది తొలి నెలలో వచ్చే అష్టమి కావడంతో ప్రథమాష్టమిగా పేరొందినట్లు కథనం. ఈ తిథి నాడు ఇంటిలో జ్యేష్ఠ సంతానం బిడ్డను ప్రత్యేకంగా అలంకరించి పెద్దలు, గురువులు వంటి ప్రముఖులు ఆశీర్వదించడం ఆనవాయితీ. ప్రథమాష్టమి పురస్కరించుకుని మేనమామ కానుకగా సమర్పించిన కొత్త బట్టలు మేనల్లుడు, మేనగోడలు ధరించి ప్రత్యేక పూజల్లో పాల్గొనడం ఆచారం. తొలి సంతానం దీర్ఘాయుష్షు, సుఖ సమృద్ధి ఆకాంక్షతో ఈ పూజాదులు నిర్వహిస్తారు.

ఎండురి పితా ఘుమఘుమలు

ప్రథమాష్టమి వేడుకల్లో ఎండురి పితా ప్రతీతి. ఇదో సంప్రదాయ వంటకం. ఈ పండగ పురస్కరించుకుని ఏడాదికోసారి ఈ పిండి వంటకం తయారు చేస్తారు. పసుపు ఆకుల్లో ఉక్కించిన కుడుము ఎండురి పితా. కొబ్బరి, బెల్లం కూరి కుడుముని పసుపు ఆకుల్లో ఉక్కించడంతో ఈ వంటకం తయారు అవుతుంది. దీంతో కంద, కంద మూలం వంటి దుంప జాతులతో ఇగురు వంటకం, తియ్యని పాయసం ఆరగింపులో చోటు చేసుకుంటాయి.

పలు పేర్లతో...

ఒడియా పంచాంగం ప్రకారం మార్గశిర తొలి మాసంగా పరిగణించి అగ్రహాయన మాసంగా పేర్కొంటారు. ఈ మాసంలో తొలి అష్టమి ప్రథమాష్టమి, సౌభాగిని అష్టమి, కాల భైరవ అష్టమి, పాప నాశిని అష్టమిగా పేర్కొంటారు. ఈ తిథి రోజు కలశ పూజ, వరుణ పూజ చేస్తారు.

జ్యేష్ఠ సంతానానికి ప్రాధాన్యత

ఇంటిలో ప్రథమ సంతానం ప్రధానంగా మగ బిడ్డకు ఈ అష్టమి నాడు మేనమామ సమర్పించిన కొత్త బట్టలు తొడిగి ప్రత్యేక పూజాదులతో సందడిగా వేడుకగా జరుపుకుంటారు. తండ్రి తదనంతర కుటుంబ బాధ్యతలు తొలి మగబిడ్డ నిర్వహించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో పసితనం నుంచే తోబుట్టువుల్లో పెద్దన్నపై గౌరవ భావం ప్రేరణకు ప్రథమాష్టమి వేడుక సామాజిక సోపానంగా నిలుస్తుంది. తొలి సంతానం ఆడ బిడ్డ అయినా ఇదే తరహాలో వేడుక జరుపుతారు.

కపాలి మఠానికి లింగరాజు

ప్రథమాష్టమి పుణ్య తిథి నాడు ఏకామ్ర క్షేత్ర వాసుడు లింగరాజు మహా ప్రభువు మేన మామ సన్నిధికి ఏగుతాడు. స్థానిక కపాలి మఠానికి లింగరాజు మహా ప్రభువు ఊరేగింపుగా తరలి వెళ్లడం ఆలయ సంప్రదాయాల్లో ఒకటిగా కొనసాగుతుంది. ఈ మఠం ఆరాధ్య దైవం వరుణేశ్వరుడు మరియు బలదేవుడు. ఈ మఠం ఆవరణలో పాప నాశిని పుష్కరిణి నెలకొని ఉంది. ప్రథమాష్టమి నాడు ఈ పుష్కరిణి జలం సేవిస్తే సర్వ పాపాలు తొలగుతాయని విశ్వసిస్తారు.

తాంత్రికంగా ప్రధానం

తంత్ర సాధకులకు అత్యంత ప్రధానమైనది. ప్రథమాష్టమి (జ్యేష్ఠ అష్టమి) తాంత్రికంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సంప్రదాయంలో ఈ తిథిని ఘోర రాత్రిగా పేర్కొంటారు. ఈ తిథి నాడు ఆది శక్తి కాళ రాత్రిగా ఆవిర్భవించినట్లు ఈ వర్గీయులు పేర్కొంటారు.

కావడి యాత్ర

నీల మాధవుని క్షేత్రం నుంచి శ్రీజగన్నాథుని శ్రీక్షేత్రానికి ప్రథమ కావడి యాత్ర ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఏటా మార్గశిర అష్టమి పురస్కరించుకుని ప్రథమాష్టమి వేడుకగా జరుపుకోవడం ఆచారం. ఈ వేడుక శ్రీజగన్నాథుని సంస్కృతితో ముడిపడి ఉంది. కావడిలో పచ్చి బియ్యం, మినుములు, కొబ్బరి, బెల్లం, అరటి పండ్లు, నెయ్యి, గంధం, కర్పూరం, జామ, జాజికాయ, తమలపాకులు, పసుపు, లవంగాలు, ఏలకులు వంటి వివిధ సుగంధ ద్రవ్యాలు, గోపాల వల్లభ భోగం కోసం పలు రకాల పండ్లు, అలంకరణ కోసం తులసి మరియు తామర పువ్వులు కావడిలో సర్ది శ్రీక్షేత్రానికి తరలిస్తారు.

పట్టు వస్త్రాల బహూకరణ

ప్రథమాష్టమి పురస్కరించుకుని శ్రీమందిరం రత్న వేదికపై కొలువుదీరిన మూల విరాటులకు పట్టు వస్త్రాల బహూకరణ సంప్రదాయం. ఏటా నీల మాధవుని క్షేత్రం నుంచి ఈ వస్త్రాలను కావడితో ఊరేగింపుగా తరలించడం కావడి యాత్రగా ప్రతీతి. ప్రథమాష్టమి రోజు రత్న వేదికపై కొలువుదీరిన శ్రీజగన్నాథుడు, బలభద్రుడు, దేవి సుభద్ర, సుదర్శనుడు, మాధవుడు, భూదేవి మరియు శ్రీదేవికి ఈ పట్టు వస్త్రాలతో శోభిల్లుతారు.



జ్యేష్ఠ సంతానంతో ప్రథమాష్టమి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)



ఎండురి పితా తయారీలో వినియోగించే పసుపు ఆకులు



ఎండురి పితా

గంజాయితో ఇద్దరు అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: గజపతి జిల్లా నుంచి రాయిపూర్‌కు ఒక ద్విచక్ర వాహనంలో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అంబొదల పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఐఐసీ కార్తీక్ నాయక్ తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఎప్పటిలాగే అంబొదల పోలీసులు కళాశాల కూడలిలో ఆదివారం సాయంత్రం వాహన తనిఖీలను నిర్వహించారు. ఈ క్రమంలో బైకుపై వస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆపి తనిఖీ చేయగా బ్యాగులో పది కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో గంజాయి రవాణా చేస్తున్న కలహండి జిల్లా జున్నగడ్ పోలీసుస్టేషన్ పరిధి బొలొదియావాల్ గ్రామానికి చెందిన సంజయ్ కుమార్ మెహర్ (32), అదే జిల్లా చించలగుడ గ్రామానికి చెందిన కాలేశ్వర్ మెహర్ (29)లను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.5 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు, బైకును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



ప్రమాద స్థలంలో టిప్పర్, ప్రజలు



రహణదేవ్ గోండ్ మృతదేహం వద్ద బంధువులు

జయపురం:

కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి గదియాఝొల కూడలి వద్ద సోమవారం ఉదయం ఘోర ప్రమాదం జరిగింది. ఇసుక రవాణా చేసే ఒక టిప్పర్, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాద స్థలంలోనే ఒక యువకుడు మృతి చెందాడు. మరణించిన యువకుడు నందపూర్ ప్రాంత దేవఘుందన గ్రామానికి చెందిన రహణదేవ్ గోండ్‌గా గుర్తించారు. గాయపడిన వ్యక్తిని కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నందపూర్ నుంచి పలిబ గ్రామానికి ఒక టిప్పర్ ఇసుక తీసుకెళ్తోంది. అదే సమయంలో దేవఘుందన గ్రామం నుంచి రహణదేవ్ గోండ్, రుద్ర హంతాల్‌లు ఒక ద్విచక్ర వాహనంతో వస్తుండగా గొదియఝొళ కూడలి వద్ద ఢీకొన్నాయి. దీంతో ఘటనా స్థలంలో మరణించిన యువకుడి బంధువులు నష్ట పరిహారం చెల్లించాలని ఆందోళన చేపట్టారు. విషయం తెలిసిన నందపూర్ పోలీసు అధికారి ఆశ్రిత ఖల్కో, ఎస్ఐ దీప్తిమయి దారువ, దేబదర సాహు మొదలగువారు ఘటన ప్రాంతానికి చేరుకొని ఉభయ వర్గాలతో చర్చించారు. నష్ట పరిహారం తప్పకుండా లభిస్తుందని ఆందోళనకారులకు హామీ ఇచ్చి వారిని శాంతపరచారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.

న్యూస్‌రీల్

రేపటి నుంచి డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం పరిధిలో బుధవారం నుంచి డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. తుఫాన్ నేపథ్యంలో మంగళవారం నుంచి బుధవారానికి మార్పు చేశారు. ఈ నెల 21వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. పరీక్షల నిర్వహణకు వర్సిటీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల నిర్వహణ, పరీక్ష కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టిపెట్టారు. వర్సిటీకి అనుబంధంగా 99 డిగ్రీ కళాశాలలు ఉండగా, 54 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు డిగ్రీ కోర్సులు బీఎస్సీ, బీఏ, బీకాం, బీబీఎంల నుంచి రెగ్యులర్‌గా 7042, సప్లిమెంటరీ విధానంలో 3439 మంది హాజరు కానున్నారు. 10481 మంది హాజరయ్యారు.

పెట్రోల్ బంక్ ఏర్పాటుకు స్థల పరిశీలన

కొత్తూరు: మండల కేంద్రంలోని పాలకొండ రోడ్డులో గిరిజన కార్పొరేషన్ స్థలంలో ప్రభుత్వ పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమార్ సోమవారం స్థల పరిశీలన చేశారు. స్థలానికి సంబంధించిన రికార్డులతో పాటు సమగ్ర వివరాలను తహసీల్దారు చక్రవర్తిని అడిగి తెలుసుకున్నారు. వివరాలను నివేదిక అందించాలని ఆదేశించారు.

బాలుడు అదృశ్యం


సాగర్ ప్రదీప్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ తిలక్‌నగర్‌కు చెందిన సాగర్ ప్రదీప్ అనే బాలుడు అదృశ్యమైనట్లు తల్లి కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం ఏడున్నర గంటల నుంచి కనిపించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వేస్టేషన్‌లోని చైల్డ్ లైన్ సిబ్బందిని కూడా సంప్రదించారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు బాలుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

ముగ్గురు ఫార్మసిస్ట్‌లకు పదోన్నతులు


పదోన్నతుల ఉత్తర్వులను నరసింగరావుకు అందిస్తున్న ఆర్డీ సుజాత

అరసవల్లి: జిల్లాలో వైద్యారోగ్య శాఖ పరిధిలో పలు పీహెచ్‌సీల్లో జోనల్ క్యాడర్‌లో గ్రేడ్-2 ఫార్మసిస్టులుగా పనిచేస్తున్న ముగ్గురికి గ్రేడ్-1 ఫార్మసిస్టులుగా పదోన్నతులు కల్పించడంతో పాటు కొత్త స్థానాలకు బదిలీ చేస్తూ వైద్యారోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ సుజాత సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో తిలారు పీహెచ్‌సీలో పనిచేస్తున్న బమ్మిడి నరసింగరావుకు విజయనగరం జిల్లా ఆస్పత్రికి, బూర్జ పిహెచ్‌సిలో పనిచేస్తున్న గురుమూర్తికి విజయనగరం ఆస్పత్రికి, అలాగే తిలారులోనే పనిచేస్తున్న తులసికి శ్రీకాకుళం రిమ్స్‌లో గ్రేడ్-1గా పదోన్నతులు కల్పించారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

సాక్షి, విశాఖపట్నం: మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల కలిగే విద్యుత్ ప్రమాదాలు, అంతరాయాలపై ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచించారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు సంస్థ డైరెక్టర్లు, 5 సర్కిళ్ల అధికారులకు అవసరమైన సూచనల్ని సీఎండీ చేశారు. ప్రమాదాలు, అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1912కి తెలియజేయాలన్నారు. తుపాను సహాయక కేంద్రాలకు, హాస్పిటల్స్‌కు తప్పనిసరిగా విద్యుత్ సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్ల ఎస్‌ఈలను ఆదేశించారు. తుపాను ప్రభావానికి తెగిపడే విద్యుత్ వైర్లను, విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను సరిచేసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని, పరికరాలను అందుబాటులో ఉంచాలని ఎస్‌ఈల్ని ఆదేశించారు. డైరెక్టర్ ఆపరేషన్స్ బి.రమేష్ ప్రసాద్ రాజమండ్రి సర్కిల్ లోనూ, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ ఏవీవీ సూర్యప్రతాప్ ఏలూరు సర్కిల్‌లో పునరుద్ధరణ చర్యల ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. వినియోగదారుల నుంచి వచ్చే విద్యుత్ అంతరాయాల ఫిర్యాదులు, సమస్యలను నమోదు చేసుకునేందుకు ఐదు జిల్లాల్లో కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు సీఎండీ తెలిపారు. సమాచారాన్ని టోల్ ఫ్రీ నెం. 1912, వాట్సాప్ నంబర్ 8500001912, కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లకు తెలియజేయాలని సూచించారు.

శ్రీముఖలింగం హుండీ ఆదాయం రూ.రెండు లక్షలు

జలుమూరు: శ్రీముఖలింగంలో కార్తీక సోమవారం సందర్భంగా హుండీ ఆదాయం రూ.2,00,493 వచ్చినట్లు ఈఓ పి.ప్రభాకరరావు తెలిపారు. ఇందు లో ప్రత్యేక దర్శనం రూ. 87,840, స్థలపురాణం, పుస్తకాల విక్రయం ద్వారా రూ.2520, కేశఖండన ద్వారా రూ. 1200, ప్రసాదాలు రూ. 32,490, గుడ్డ హుండీ రూ.75,323 తదితరవి మొత్తం రూ. 2,00,493 వచ్చిందని ఆయన తెలిపారు.


కుంచరదాలో వరి కుప్పలు వేస్తున్న దృశ్యం


హింజలికాటులో ఎడ్లబండిలో గ్రామానికి తరలిస్తున్న వరిపంట


రొండాలో వరి మోపులతో గ్రామానికి వెళ్తున్న కూలీలు

చివరి ప్రయాస..!

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో గంజాం జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరిపంటను రక్షించుకునేందుకు రైతులు ప్రయాస పడుతున్నారు. ఇప్పటికే కోతలు పూర్తవ్వడంతో సురక్షిత ప్రాంతాలకు వరి పనలను తొలగిస్తున్నారు. కల్లాల్లో ఉన్నటువంటి వరి కుప్పలపై టార్పలిన్లు కప్పుడుతున్నారు. వర్షం వలన నష్టం వాటిల్లితే ప్రభుత్వం గిట్టుబాటు ధరను పెంచాలని కోరుతున్నారు.

- బరంపురం


గొళంతరలో పొలంలోని వరి పనలను తీస్తున్న రైతు


చికిటిలో పంట పొలంలోనే వరి పనలు


ముసురు వేయడంతో వేగంగా వరికోతలు పూర్తి చేస్తున్న దృశ్యం

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సన్నద్ధం

● కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్


రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్


విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ సింగ్

రాయగడ: మిచౌంగ్ తుఫాన్‌ను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్ అన్నారు. తుఫాన్ పరిస్థితిపై యంత్రాంగం తీసుకున్న చర్యల గురించి సోమవారం విలేకరులతో మాట్లాడారు. తుఫాన్ ప్రభావం జిల్లాలో మంగళవారం సాయంత్రం నుంచి ప్రారంభమవుతుందన్నారు. 11 సమితుల్లో ఇప్పటికే అన్ని రకాల ముందస్తు చర్యలను చేపట్టామని, ప్రభావిత ప్రాంతాల్లో తుఫాన్ వలన నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరుపున తగు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, బీడీవోలతో పాటు సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలియజేశారు. ఇళ్లు కూలిపోవడం, పైకప్పులు ఎగిరిపోవడం వంటి సంఘటనలు వెంటనే సహాయక చర్యలు చేపట్టేవిధంగా సిద్ధం చేశామని వెల్లడించారు. అదేవిధంగా రెండు ఓడ్రాఫ్ బృందాలను సైతం రంగంలోకి దించడం జరిగిందన్నారు. జిల్లా కేంద్ర రైల్వేస్టేషన్‌లో హెల్ప్‌లైన్ డెస్క్ ప్రారంభించామని తెలియజేశారు.

శంభో.. శివ శంభో

కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకుని గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువ జామునుంచే ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. ఆలయాల వద్ద శివనామ స్మరణ మార్మోగింది. విశేష పూజలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు దీపారాధనలు చేసి మొక్కు లు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు, ఆలయ కమిటీ ప్రతినిధులు చర్యలు చేపట్టారు.

- బరంపురం


నీలకంఠేశ్వర్ ఆలయంలో శివ లింగానికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు


నీలకంఠేశ్వర్ ఆలయలో బారులుతీరిన భక్తులు


అర్చకులతో ప్రత్యేక పూజలు అందుకుంటున్న పటిక స్వయంబు లింగేశ్వరుడు


అష్టశంబు లింగానికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

చిత్రకళా ప్రదర్శన


చిత్రకళ ప్రదర్శన తిలకిస్తున్న అధికారులు


చిత్రకళ ప్రదర్శన ప్రారంభిస్తున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ తదితరులు

పర్లాకిమిడి: స్థానిక బిజూ కల్యాణ మండపంలో ఒడిశా లలిత కళా అకాడమీ ద్వారా ఏర్పాటు చేసిన చిత్రకళా ప్రదర్శనను కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ సోమవారం ప్రారంభించారు. ఆయనతో పాటు ఏడీఎం రాజేంద్రమింజ్ ఇతర అధికారులు విచ్చేశారు. ఒడిశాలో ప్రావీణ్యం పొందిన ఉద్దండ కళాకారులు డి.నారాయణరావు, ఆసిం, దాస్ ముర్ము, జ్యోతిర్మయి పట్నాయక్, సుబేందు మిశ్రా, ఆసిత్ పట్నాయక్, ఎస్.చంద్రశేఖర్‌రావు, పద్మనాభ బెహరా తదితరులు పెయింటింగ్స్‌ను ప్రదర్శనలో ఉంచారు. ఈ ప్రదర్శన ఈనెల 6వ తేదీ వరకూ ఉంటుందని జిల్లా సాంస్కృతిక అధికారి అర్చనా మంగరాజ్ తెలిపారు.

పోడియాలో మాల్యవంత్ ఉత్సవాలు


శబరీ నదిలో నీటిని కలశాలతో తీసుకొస్తున్న విద్యార్థులు


నృత్యం చేస్తున్న ఆదివాసీలు

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియా సమితిలో సమితి స్థాయి మాల్యవంత్ ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సోమవారం ఉదయం శబరీ నది జలం తీసుకొచ్చి కుమార్‌గూడ గ్రామంలో ఉన్న దుర్గ మందిరంలో కలశాలు ఉంచి అక్కడ నుంచి పోడియ హైస్కూల్ ఆవరణలో జరుగుతున్న ఉత్సవ మండపానికి ఊరేగింపుగా వెళ్లారు. ముఖ్య అతిథిగా మల్కన్‌గిరి సబ్ కలెక్టర్ అక్షయ్ కుమార్ ఖేముండు హాజరయ్యారు.

ఓ చోరీ బీహారీ ముఠా పనే


ఇంట్లో వేలి ముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

నరసన్నపేట: స్థానిక ఇందిరానగర్‌లోని దంత వైద్యుని ఇంటిలో చోరీకి పాల్పడింది బీహార్‌కు చెందిన ముఠా అని పోలీసులు అనుమానిస్తున్నారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా వీరు చోరీలకు పాల్పడుతారని పోలీసు అధికారులు అంటున్నారు. దొంగల కోసం గాలింపు చేస్తున్నామని సీఐ ప్రసాద్ తెలిపారు. మరో వైపు చోరీ సంఘటనపై టెక్కలి డీఎస్పీ భాల చంద్రారెడ్డి సోమవారం ఆరా తీశారు. నరసన్నపేట పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఆయన డాక్టర్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సీఐ, ఎస్‌ఐలతో మాట్లాడి సీసీ ఫుటేజీలు పరిశీలించారు. అలాగే తమ ఇంట్లో చోరీకి గురైన బంగారు ఆభరణాలు 96 తులాలు ఉంటాయని, నగదు రూ. 4.5 లక్షలని డీఎస్పీకి తెలిపినట్లు వైద్యుడు గురుదేవ్ పేర్కొన్నారు. కేసు నమోదు చేయడానికి సమయం పడుతున్నట్లు తెలుస్తోంది.

నాగావళి తీరంలో రక్షణ గోడలు


ముద్దాడపేట వద్ద రివర్ ప్రొటెక్షన్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: నాగావళి నదీ పరివాహక గ్రామాల్లో వరదల నివారణ కోసం రివర్ ప్రొటెక్షన్ వాల్ నిర్మాణాలు చేపడుతున్నట్లు స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. మండలంలో ముద్దాడపేట, పీర్‌సాహెబ్‌పేట గ్రామాల్లో రూ. 96 లక్షల వ్యయంతో నిర్మించనున్న రివర్ ప్రొటెక్షన్ వాల్ (రక్షణ గోడ) నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. వరదలు వచ్చే సమయంలో నాగావళి నదికి ఆనుకుని ఉన్న గ్రామాలు కోతకు గురికావడంతో పాటు వరద నీరు ఇళ్లలోకి ప్రవేశిస్తోందని తెలిపారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో వరదలను నివారించడానికి రక్షణ గోడ నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని అన్నారు. బలసలరేవు బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే సులువుగా ప్రయాణాలు చేయడానికి వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఎస్‌ఈ పి.సుధాకర్, డీఈ ఎం.మురళీమోహన్, ఏఈఈ కె.రాంబాబు, ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు, ఈఓ పీఆర్డీ గోవిందరావు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, పార్టీ నాయకులు గురుగుబెల్లి గిరి, బొడ్డేపల్లి శ్రీనాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లన్న ఆదాయం రూ.8,10,282

టెక్కలి: కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా టెక్కలి మండలం రావివలస మల్లన్న ఆలయానికి రూ.8,10,282 ఆదాయం వచ్చినట్లు ఉత్సవాల నిర్వాహణాధికారి వీవీఎస్ నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. శీఘ్ర దర్శనం ద్వారా రూ.2,74,000, శీర్షాభిషేకం ద్వారా రూ.2,92,040, కేశఖండన టికెట్‌ల ద్వారా రూ.28,520, హుండీ ల ద్వారా రూ.2,15,722 మొత్తం రూ.8,10,282 ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.1,38,942 ఆదాయం తగ్గినట్లు పేర్కొన్నారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు మాన్విత

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్కూల్ గేమ్స్ వాలీబాల్ చాంపియన్‌షిప్-2023 పోటీలకు జిల్లా కు చెందిన వంగపండు లీలా మాన్విత ఎంపికైంది. ఈ మేరకు రాష్ట్ర స్కూల్‌గేమ్స్ సెక్రటరీ భానుమూర్తి నుంచి సమాచారం అందింది. ఇటీవలి అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వేదికగా జరిగిన 67వ ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-14 బాలబాలికల వాలీబాల్ చాంపియన్‌షిప్-2023 పోటీల్లో జిల్లా జట్టు రాణించింది. ఇదే జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మాన్విత మెరుగైన ఆటతీరు కనబరచడంతో జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈ పోటీ లు ఈనెల 22 నుంచి 26 వరకు భువనేశ్వర్‌లోని విట్ కాలేజ్ వేదికగా త్వరలో జరగనున్నాయి.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..

శ్రీకాకుళం హడ్కోకాలనీలో నివాసం ఉంటున్న వీఎల్ మాన్విత.. నగరంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. గత మూడేళ్లుగా తల్లిదండ్రులు వి.శ్రీరాములు, కె.సుశీల (పీడీ) ప్రోత్సాహంతో వాలీబాల్‌లో నిరంతరం సాధన చేస్తోంది. గత ఏడాది కూడా నరసారావుపేటలో జరిగిన రాష్ట్రపోటీల్లో అత్యద్భుతంగా రాణించడంతో జాతీయ పోటీలకు ఎంపికైంది. మాన్విత అక్క వి.లిఖిత కూడా వాలీబాల్ క్రీడాకారిణి కావడం విశేషం. మాన్విత జాతీయ పోటీలకు ఎంపిక కావడంపై పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రభావతి, పీడీ కె.విజయ్‌కుమార్, కోచ్ కె.హరికృష్ణ, స్కూల్‌గేమ్స్ సెక్రటరీ బీవీ రమణ, వాలీబాల్ సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.


వాలీబాల్ సాధనలో మాన్విత

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: పార్వతీపురం ఐసీడీఎస్ పరిధిలో ఏడు అంగన్వాడీ కార్యకర్తలు, 19 సహాయకులు, 8 మినీ అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి సోమవారం తెలిపారు. పార్వతీపురం డివిజన్ లోని కొమరాడ ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్వాడీ కార్యకర్త, ఐదు సహాయకులు, ఒక మినీ అంగన్వాడీ పోస్టుకోసం దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే పార్వతీపురం ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్వాడీ కార్యకర్త, రెండు అంగన్వాడీ సహాయకులు, ఒక మినీ అంగన్వాడీ పోస్టులు, పాచిపెంట ప్రాజెక్టు పరిధిలో మూడు అంగన్వాడీ కార్యకర్త, ఆరు అంగన్వాడీ సహాయకులు, నాలుగు మినీ అంగన్వాడీ పోస్టులు, సాలూరు ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టు, ఒక మినీ అంగన్వాడీ పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. పాలకొండ డివిజన్‌లోని కురుపాం ప్రాజెక్టు పరిధిలో రెండు అంగన్వాడీ కార్యకర్తలు, నాలుగు అంగన్వాడీ సహాయక పోస్టులు, ఒక మినీ అంగన్వాడీ పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు 21 నుంచి 35ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు ఈనెల 6 నుంచి 14వ తేదీ సాయంత్రం లోగా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు బ్యాక్‌లాగ్ పోస్టులు



నియామక ఆదేశ పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన బ్యాక్‌లాగ్ ఉద్యోగ నియామకాలలో భాగంగా పోస్టుల నియామక పత్రాలను కలెక్టర్ నాగలక్ష్మి సోమవారం కలెక్టరేట్‌లో అందజేశారు. జిల్లా యంత్రాంగం మార్చి- 2023లో ప్రకటించిన నోటిఫికేషన్ ఆధారంగా జరిపిన నియామకాల్లో వివిధ కేటగిరిల్లో నాలుగు పోస్టులను భర్తీ చేశారు. వాటిలో గ్రూప్-4 కేటగిరి జూనియర్ అసిస్టెంట్ పోస్టులు (ఒ.హెచ్.-జనరల్)-2, క్లాస్-4 కేటగిరి పోస్టు నైట్ వాచ్‌మన్ (హెచ్.హెచ్.-జనరల్)-1, దోబీ/చెక్లర్/స్వీపర్ (హెచ్.హెచ్.-జనరల్) కేటగిరి పోస్టు-1 ఉన్నాయి. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఎ.డి జీవీబీజగదీశ్ పాల్గొన్నారు.

చోరీకి గురైన ఐదు మోటార్ సైకిల్స్ స్వాధీనం

విజయనగరం క్రైమ్: జిల్లాలో చోరీకి గురైన ఐదు మోటార్ సైకిల్స్ స్వాధీనం చేసుకున్నామని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా స్వాధీనం చేసుకున్న బైక్‌లను పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయనగరం వన్‌టౌన్, రూరల్, జామి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో చోరీకి గురైన ఐదు మోటార్‌సైకిల్స్‌ను రికవరీ చేశామన్నారు. ఈ కేసులో మైనర్‌ను అదుపులోకి తీసుకుని, విచారణ చేపట్టగా అందిన సమాచారం మేరకు విజయనగరం పట్టణంలో చోరీకి గురైన మూడు మోటార్‌సైకిల్స్, జామి స్టేషన్ పరిధిలో చోరీకి గురైన ఒక మోటార్ సైకిల్, విజయనగరం రూరల్ పీఎస్ పరిధిలో చోరీకి గురైన మరో మోటార్ సైకిల్‌ను రికవరీ చేశామని తెలిపారు. మోటార్ సైకిల్స్‌ను రికవరీ చేయడంలో క్రియాశీలకంగా పనిచేసిన సిబ్బందిని అభినందించారు.

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన డీఐజీ



సిబ్బందికి సూచనలిస్తున్న డీఐజీ హరికృష్ణ

భోగాపురం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ సోమవారం సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాలు గతం కన్నా బాగా తగ్గుముఖం పట్టాయన్నారు. అలాగే ఈప్రాంతంలో పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తుండడంతో కేసులు కూడా తగ్గుముఖం పట్టాయని సంతృప్తి వెలిబుచ్చారు. సైబర్ క్రైమ్, సముద్రపు నల్ల ఇసుక అక్రమ తరలింపు, గంజాయికి సంబంధించిన వాటిపై విలేకరులు అడగగా ప్రజలు సమాచారం అందిస్తే నివారించడానికి చేయడానికి అవకాశం ఉంటుందని, ఎక్కడైనా అలాంటి విషయాలు మీ దృష్టికి వస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం క్రైమ్‌లు, తీసుకుంటున్న చర్యలు, అవగాహన తదితర అంశాలపై పోలీసు సిబ్బందితో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్పీ ఎం.దీపిక, డీఎస్పీ గోవిందరావు, సీఐ వీవీ వెంకటేశ్వరరావు, ఎస్సైలు ఎస్.కృష్ణమూర్తి, యు.మహేశ్, సూర్యకుమారి, నారాయణరావు పాల్గొన్నారు.

కాలిన షాప్

విజయనగరం క్రైమ్: స్థానిక మూడులాంతర్లు జంక్షన్ వద్ద ఉన్న పాన్‌షాప్, టీషాప్ పక్కన గల విద్యుత్ పోల్స్‌నుంచి షార్ట్ సర్క్యూట్ కావడంతో సోమవారం రాత్రి మంటలు చెలరేగాయి. ఈ మంటలకు షాపుపై భాగం కాలిపోయింది. ఈ విషయం గమనించిన స్థానికులు స్పందించి మంటలను అదుపుచేశారు. సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి పూర్తిగా మంటలను ఆర్పివేశారు. ఎవరికీ అదృష్టవశాత్తు ఎటువంటి ప్రమాదం సంభవించలేదని అధికారులు స్పష్టం చేశారు.

ఎంతమంది కలిసినా ఏం నష్టం?

- సీఎంగా మళ్లీ గెలిచేది జగన్‌మోహన్ రెడ్డే
- డిప్యూటీ సీఎం రాజన్నదొర



విలేకరులతో మాట్లాడుతున్న రాజన్నదొర, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

పాలకొండ: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ని పార్టీలు పొత్తు పెట్టుకున్నా? ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహనరెడ్డి గెలుస్తారని డిప్యూటీ సీఎం, గిరిజన శాఖా మాత్యులు పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పాలకొండ పట్టణంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం నివాస గృహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్న తీరుపై ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డికి ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోందని, దానిని చూడలేని ప్రతిపక్ష టీడీపీ, దానికి వత్తాసు పలికే పార్టీలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని ఆరోపించారు. అధికారంలో ఉండగా ప్రజలను మోసగించిన చంద్రబాబు ఇప్పుడు మరోమారు ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇందుకు వారి అనుకూల మీడియాను అడ్డుపెట్టుకుంటున్నారన్నారు.

ఆదర్శంగా రాష్ట్రంలోని పథకాలు

అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో ఇచ్చిన హామీలు 95శాతం పూర్తి చేసిన ముఖ్యమంత్రి జగన్‌కు, అధికారంలో ఉండగా చెప్పుకునేందుకు ఒక మంచి పథకం కూడా అమలు చేయని చంద్రబాబుకు ఎంతో తేడా ఉందని వివరించారు. విద్య, వైద్యం, సంక్షేమ అన్నింటా నూతన ఒరవడిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిందని, ప్రజలకు పాలన చేరువ చేసిందని చెప్పారు. రాష్ట్రంలో జగన్ ప్రవేశ పెట్టిన పథకాలు దేశంలోని పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నాయన్నారు.

రాష్ట్రంలో ప్రజల రాజ్యం

తెలంగాణలో కుటుంబ పాలన కారణంగానే బీఆర్ఎస్ ఓడిపోయిందని, దొరల రాజ్యం అక్కడ ఉండేదని, ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల రాజ్యం ఉందని పేర్కొన్నారు. మూడు రాజధానులను ఒక సామాజిక వర్గం మాత్రమే వ్యతిరేకిస్తోంది తప్ప ప్రజల నుంచి మద్దతు ఉందన్నారు.

తెలంగాణలో పవన్ తుస్..

పవన్ కల్యాణ్ పార్టీ తెలంగాణలో తేలిపోయిందని, 80శాతం ఆంధ్రులు ఉన్న కూకటపల్లిలో జనసేన పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఆంధ్రలో టీడీపీ, జనసేన పొత్తుతో తమకు కలిగే నష్టం ఏమీ లేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అభివృద్ధిపై మాట్లాడుతున్న ప్రతిపక్షాలు వారు అధికారంలో ఉండగా ఏం చేశారని ప్రశ్నించారు. సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, శాసనమండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం, ఇతర నాయకులు ఉన్నారు.

బత్తిలి పోలీస్ స్టేషన్ ప్రారంభం

భామిని: మండలంలోని బత్తిలిలో నూతనంగా నిర్మించిన మోడల్ పోలీస్‌స్టేషన్ భవనాన్ని డిప్యూటీ ముఖ్యమంత్రి,గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర సోమవారం ప్రారంభించారు. అనంతరం ఎస్పీ విక్రాంత్ పాటిల్,డీఎస్పీ కేవీ కృష్ణారావులు నూతన భవనంలోని నిర్మాణాలు, గదులను డిప్యూటీ సీఎం రాజన్నదొరకు చూపించి వివరించారు. ముందుగా సాయుధ దళాలు డిప్యూటీ సీఎంకు పోలీస్ వందనం సమర్పించాయి. కార్యక్రమంలో పాలకొండ శాసన సభ్యురాలు విశ్వాసరాయి కళావతి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ బాబు, సీఐ కె.మురళీధర్, ఎస్సై యతిరాజుల అమ్మానరావు, బత్తిలి సర్పంచ్ టింగ శాంతికుమారి, ఎంపీటీసీ టింగ అన్నాజీరావు, కోఆప్షన్ సభ్యుడు విశ్వనాథ పట్నాయక్, ఉపసర్పంచ్ వమ్మరవిల్లి రమేష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మజ్జి మోహనబాబు, బోదెపు శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మోడల్ పోలీస్‌స్టేషన్ భవనాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, చిత్రంలో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్‌బాబు, డీఐజీ హరికృష్ణ, ఎస్పీ విక్రాంత్ పాటిల్

అత్యవసరమైతేనే బయటకు రండి

- తుఫాన్ దృష్ట్యా కలెక్టర్ విజ్ఞప్తి
- నేడు పాఠశాలలకు సెలవు



మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: మిచాంగ్ తుఫాన్ తీవ్రత దృష్ట్యా మంగళ, బుధవారాలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తుఫాన్ తీవ్రత దృష్ట్యా జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. తుఫాన్ తీవ్రత ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు చేపట్టామని చెప్పారు. జిల్లాలో మనుషులు, జంతువుల ప్రాణనష్టం, పంటనష్టం జరగకుండా ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు. మిచాంగ్ తుఫాను ఏర్పాట్లపై సోమవారం ఆయన కలెక్టరేట్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లాలో 1.70 లక్షల ఎకరాలలో పంట వేశారని, 4,200 మెట్రిక్ టన్నుల వరకు నూర్పులు జరిగాయన్నారు. 629 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద సురక్షితంగా ఉందని, మిగిలిన మొత్తం ధాన్యం యుద్ధ ప్రాతిపదికన మిల్లులకు తరలించామని చెప్పారు. ధాన్యం, ఇతర పంటలు ఎక్కడ ఉన్నా వ్యవసాయ సహాయకులకు సమాచారం అందించాలని కోరారు. తుఫాన్ పట్ల రైతు భరోసా కేంద్రాలలో రెండు దఫాలుగా అవగాహన సమావేశాలు నిర్వహించామని పేర్కొన్నారు. పంట కోతకోయకుండా ఉంటే అలానే ఉంచాలని సూచించారు. తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా అన్ని నీటి పథకాలను పూర్తి సామర్థ్యంతో నింపి, ప్రజలకు రెండు రోజులకు సరిపడా నీటిని నిల్వ ఉంచాలని సూచించారు. తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా గ్రామీణ నీటి సరఫరా విభాగం 79 జనరేటర్లు సిద్ధంగా పెట్టినట్లు తెలిపారు.

విపత్తుల నివారణ బృందాలు సిద్ధం

రహదారులపై చెట్లు, స్తంభాలు కూలితే తక్షణం తొలగించేందుకు జిల్లా విపత్తులు, స్పందన శాఖ నుంచి 13 బృందాలు, రహదారులు, భవనల శాఖ నుంచి 15 బృందాలు సిద్ధం చేశామని కలెక్టర్ చెప్పారు. చెరువులు, నదులలో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించేందుకు బోటు రెస్క్యూ ఆపరేషన్ బృందం ఉందన్నారు. జిల్లాలో ఉన్న 39 పెట్రోల్ బంకులు పూర్తి సామర్థ్యంతో ఉండాలని, మొబైల్ సేవలకు అంతరాయం కలగకుండా పవర్ బ్యాక్ అప్ నిర్వహించాలని మొబైల్ ఆపరేటర్లను ఆదేశించినట్లు తెలిపారు.

అదనపు పడకలు ఏర్పాట్లు

అన్ని ఆస్పత్రుల్లో అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా జనరేటర్లు ఇతర బ్యాక్‌అప్ ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. 86 మంది గర్భిణులను ఇప్పటికే ఆస్పత్రులకు తరలించామని చెప్పారు. సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రిలో అదనపు పడకలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. గత అనుభవాల దృష్ట్యా ప్రమాదం సంభవించే ఆస్కారం ఉన్న 78 నదీ పరీవాహక గ్రామాలు, కొండశిఖర గ్రామాలను గుర్తించి వాటికి 79 పునరావాస కేంద్రాలను గుర్తించి సిద్ధం చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో గల 578 చౌక ధరల దుకాణాలు, 8 ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద సరుకులు పూర్తిస్థాయిలో ఉన్నాయని, పునరావాస కేంద్రాల వద్ద వంట ఏజెన్సీల ద్వారా ఆహార పదార్థాల తయారీకి సిద్ధం చేశామని తెలిపారు. మండల స్థాయిలో తహశీల్దార్, ఎంపీడీఓ, ఎస్ఐలు సమన్వయంతో పనిచేయాలని, పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినట్లు చెప్పారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో లోతట్టు ప్రాంతాలలోవున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు.

పోక్సో కేసులో ముద్దాయికి 20ఏళ్ల జైలు



ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: పోక్సో కేసులో నేరం రుజువైనందున ముద్దాయికి 20ఏళ్ల జైలుశిక్షను విధిస్తూ విజయనగరం పోక్సో స్పెషల్ కోర్టు తీర్పు వెలువరించిందని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం పట్టణంలోని విజయరామరాజు కాలనీలో ఉన్న బాలికల ఉన్నత పాఠశాలలో 9వతరగతి చదువుతున విద్యార్థిని వెంటపడిన పట్టణానికి చెందిన బొత్స కామేష్ గత ఏడాదిలో సెప్టెంబర్ నెల 15 తేదీన బాలికను పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి అంగీకరించకపోతే చనిపోతానని బెదిరించాడు. దీంతో ఆ బాలిక భయపడి కామేష్‌తో పరిచయం పెంచుకుంది. దీన్ని ఆసరాగా తీసుకుని కామేష్ బాలికపై లైంగికదాడి చేసిన కారణంగా బాధితురాలు గర్భం దాల్చింది. ఈ విషయాన్ని కామేష్‌కు తెలియజేసి పెళ్లి చేసుకోమని అడగ్గా అందుకు నిరాకరించి మందులతో గర్భాన్ని తొలగించుకో అని చెప్పి తిరస్కరించాడు. దీంతో బాధిత బాలిక తల్లి పార్వతీపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ ఎ. సుభాష్, దిశ సెల్ డీఎస్పీ ఎస్ఆర్ హర్షితలు విచారణ చేపట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం .శంకరరావు ఫిర్యాదు తరఫున వాదనలు వినిపించారు. ఈ కేసులో వాదోపవాదాల అనంతరం స్పెషల్ జడ్జి కె. నాగమణి ముద్దాయిని ఖరారు చేసి కఠినకారాగార శిక్షతో పాటు రూ. 4వేలు జరిమానా విధించారు. అలాగే బాధితురాలికి రూ. రూ.5లక్షల నష్టపరిహారం మంజూరు చేశారని ఎస్పీ విక్రాంత్ పాటిల్ చెప్పారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

గజపతినగరం: గజపతినగరం జాతీయ రహదారి వద్ద ఈనెల 2వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన వృద్ధుడు దాడి అప్పలనాయుడు(65) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గజపతినగరం ఏఎస్సై మాతామూర్తి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెంటాడ మండలం కొంపంగి గ్రామానికి చెందిన దాడి అప్పలనాయుడిని గజపతినగరం జాతీయ రహదారి వద్ద ఆటో ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో విజయనగరంలోని సర్వజన ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

చేపల వేటకు వెళ్లవద్దు..



కొండ్రాజుపాలెంలో మత్స్యకారులకు తుఫాన్‌పై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ బంగార్రాజు

భోగాపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని.. ఇటువంటి పరిస్థితుల్లో చేపల వేటకు ఎవ్వరూ వెళ్లవద్దని తహసీల్దార్ చింత బంగార్రాజు సూచించారు. సముద్రతీర ప్రాంతాలైన ముక్కాం, చేపలకంచేరు, కొండ్రాజుపాలెం గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి మత్స్యకారులకు తుఫాన్ ప్రభావంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిషోర్, వీఆర్వోలు రామునాయుడు, లక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


వెలవెలబోయిన రైల్వేస్టేషన్

మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో పలు రైళ్లు రద్దుకావడం, మరికొన్ని రైళ్లు ఆలస్యం కావడంతో సోమవారం స్థానిక రైల్వే స్టేషన్ వెలవెలబోయింది. ఆలస్యంగా నడుస్తున్న రైళ్ల కోసం ప్రయాణికులు గంటల కొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయాణికులకు రైళ్ల సమాచారం తెలియజేసేందుకు అధికారులు ప్రత్యేక సహాయ కౌంటర్ ఏర్పాటు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్



రద్దయిన రైళ్ల వివరాలు



ప్లాట్‌ఫాంపై వేచి ఉన్న ప్రయాణీకులు



నిర్మానుష్యంగా ప్లాట్‌ఫారాలు

ఆడుదాం.. ఆంధ్ర రిజిస్ట్రేషన్లలో టాప్

- ప్రథమస్థానంలో రామభద్రపురం మండలం



సచివాలయాలకు చేరిన క్రీడా సామగ్రిని పరిశీలిస్తున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, ఎంపీడీవో రమామణి

రామభద్రపురం: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఆడుదాం ..ఆంధ్ర అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది.ఈ పోటీలకు సచివాలయాలలో క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం వరకు రామభద్రపురం మండలంలో 1250 రిజిస్ట్రేషన్లు నమోదై జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉంది. బొబ్బిలి 935 రిజిష్టరేషన్లతో ద్వితీయ స్థానం, 795తో గుర్ల తృతీయ స్థానంలో ఉన్నాయి. జిల్లాలో 17,648 మంది క్రీడాకారులు వివిధ రకాల క్రీడలు ఆడేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోగా అందులో పురుషులు 16,431, స్త్రీలు 1217 మంది ఉన్నారు. అలాగే మండలంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న 1,250 మందిలో పురుషులు 996 మంది, స్త్రీలు 254 మంది ఉన్నారు. అందులో క్రికెట్ ఆడేందుకు 747 మంది పురుషులు, 28 మంది స్త్రీలు రిజిస్ట్రేషన్ చేసుకోగా బ్యాడ్మింటన్ ఆడేందుకు పురుషులు 109 మంది, 24 మంది స్త్రీలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వాలీబాల్ ఆడేందుకు 232 మంది పురుషులు, 10 మంది స్త్రీలు, కబడ్డీ ఆడేందుకు 211 మంది పురుషులు, 78 మంది స్త్రీలు, ఖోఖో క్రీడకు 110 మంది స్త్రీలు, 76 మంది పురుషులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.ఈ నెల 15 వ తేదీ నుంచి గ్రామ సచివాలయ స్థాయిలో ఈ పోటీలు పక్కాగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో ప్రతిభ కనబరిచిన విజేతలకు రూ.35 వేలు, ద్వితీయ స్థానానికి రూ.15 వేలు, తృతీయ స్థానానికి రూ.5 వేలు చొప్పున నగదు బహుమతులను ప్రభుత్వం ఇవ్వనుంది. అలాగే జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి రూ.60 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు అందించనున్నారని ఎంపీడీవో రమామణి తెలిపారు. ఆసక్తి గల యువతీయువకులు త్వరగా వారి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

శౌర్యానికి మారుపేరు భారత రక్షణరంగం



నేవీ డే వేడుకల్లో పాల్గొన్న సైనిక పాఠశాల అధికారులు, విద్యార్థులు

- కోరుకొండ సైనిక పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్‌కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి
- పాఠశాలలో ఘనంగా నావికా దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శాస్త్రి, తదితరులు

విజయనగరం రూరల్: శౌర్యానికి మారుపేరు భారత రక్షణ రంగమని కోరుకొండ సైనిక పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి పేర్కొన్నారు. భారత నావికా దళ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోరుకొండ సైనిక పాఠశాలలో నావికా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కోరుకొండ సైనిక పాఠశాల విద్యార్థులు దేశ రక్షణ రంగంలో చేరి దేశ రక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భారత రక్షణ రంగంలో నావికా దళం కీలక భూమిక పోషిస్తుందని చెప్పారు. నావికాదళం దేశరక్షణలో వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. అమరవీరులు, యుద్ధవీరుల సాహసాలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలో కేక్ కట్ చేసి అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒకరికొకరు అభినందనలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల అధికారులు, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'సీ' లాంగ్వేజ్‌లో నైపుణ్యం కీలకం



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ జీవీ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ఆడిట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేశ్వరరావు

విజయనగరం అర్బన్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు 'సీ' లాంగ్వేజ్ కోర్సుల్లో నైపుణ్యం కీలకమని విద్యార్థులు ఆ దిశగా అధ్యయనం చేసుకోవాలని జేఎన్‌టీయూ జీవీ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ఆడిట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.రాజేశ్వరరావు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని గాజులరేగలో గల సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'బూట్ క్యాంప్, హ్యాకథాన్' అనే అంశంపై ఈ నెల 9వ తేదీ వరకు నిర్వహించనున్న సదస్సును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థికి కల్పన, పరికల్పన, రూపకల్పన, కార్యనిర్వహణ, కార్యసాధన వంటి వాటిపై మంచి పట్టు ఉండాలని సూచించారు. కాయిన్ సంస్థకు చెందిన ట్రైనర్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఇంజినీరింగ్‌లో అన్ని విభాగాలకు సాఫ్ట్‌వేర్‌లో సమాన అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవడంలో విద్యార్థులంతా సఫలీకృతం కావడానికి ఇటువంటి ప్రోగ్రామ్స్ ఉపయోగ పడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, మొదటి సంవత్సరం విద్యార్థులు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ తిరుమల ప్రసాద్

విజయనగరం ఫోర్ట్: తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించినట్లు డాక్టర్ కె. తిరుమల ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఒడిశా రాష్ట్రం దమన్‌జోడికి చెందిన పూల్ కుమారిదేవి అనే 69 ఏళ్ల వృద్ధురాలు తీవ్రమైన కడుపునొప్పితో నవంబర్ 29న ఆస్పత్రిలో చేరిందన్నారు. ఆమెకు వైద్య పరీక్షలు చేయగా గాల్‌బ్లాడర్‌లో 17 సెంటీమీటర్ల పొడవు, ఐదు సెంటీమీటర్ల వెడల్పు ఓ కణితి.. అందులో వందకు పైగా రాళ్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. దీంతో ఆమెకు శస్త్రచికిత్స చేసి గాల్‌బ్లాడర్ తొలగించామని చెప్పారు. సమావేశంలో తిరుమల మెడికవర్ ఆస్పత్రి సెంటర్ హెడ్ పద్మకుమార్, డాక్టర్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు



లాటరీ విజేతకు బహుమతి అందజేస్తున్న జిల్లా ప్రజా రవాణాధికారి అప్పలనారాయణ

విజయనగరం అర్బన్: ఆర్టీసీ ప్రయాణికులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి సీహెచ్ అప్పలనారాయణ అన్నారు. సోమవారం స్థానిక డిపో ప్రాంగణంలో జరిగిన బహుమతుల ప్రదానంలో ఆయన మాట్లాడుతూ, వివిధ రూట్లలోని బస్సుల్లో ప్రయాణం చేసే వారికి లక్కీడిప్ నిర్వహించి, విజేతలను ఎంపిక చేస్తున్నామన్నారు. సింహాచలం రూటులో సీహెచ్.కృష్ణ, లక్ష్మి, భాస్కరరావు.. ఎస్‌కోట వయా జామి రూటులో ప్రసాద్, కొండమ్మ, పూజిత.. ఆంధ్ర రూట్‌లో మెరినా, సత్యవతి, పద్మ.. చీపురుపల్లి రూటులో భవాని, రాము, ఆదిలక్ష్మికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజరు బి.ఆదినారాయణ, ఎస్‌టీఐ పి.రామారావు, స్టేషన్ మేనేజర్ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో పబ్లిక్ హెల్త్ యూనిట్



హెల్త్ యూనిట్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

మెంటాడ: మండలంలోని చల్లపేట ఆస్పత్రి ఆవరణలో పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు సోమవారం భూమిపూజ చేశారు. ఏపీ(ఆంధ్రప్రదేశ్) వైద్య విధాన పరిషత్ నుంచి మంజూరైన రూ.50 లక్షల నిధులతో చేపడుతున్న ఈ నిర్మాణంలో ఆరోగ్య తనిఖీలతో పాటు మెడికల్ టెస్టులు కూడా చేయడం జరుగుతుంది. ఫిబ్రవరి నాటికి నిర్మాణం పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత చప్ప మాస్టారు, తదితరులు పాల్గొన్నారు.